క్లుప్తంగా

ఆరు రోజులే.. త్వరపడండి

దొర్నిపాడు: అన్ని అర్హతలు కల్గి వైఎస్సార్ రైతు భరోసా అందని వారు ఆరు రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో రైతు భరోసాపై గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కొత్తపాస్ పుస్తకం, డెత్‌కేసు నామిని, అర్హత ఉండి డబ్బులు పడని రైతులు ఈనెల 30వ తేదీలోపు వైఎస్సార్ రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. జీఎస్టీ చెల్లించే రైతులు 2022 మార్చి 31లోగా జీఎస్టీని రద్దు చేసినట్‌లైతే వారి వివరాలు, ఆర్‌ఓఎఫ్‌ఆర్, డీ–పట్టా ఉన్నవారు, రైతులు పొలం కల్గి ఉండి వైఎస్సార్ రైతు భరోసా పోర్టల్‌లో నోల్యాండ్ అని చూపించే రైతుల వివరాలను నో వెబ్ ల్యాండ్ ఆప్షన్‌లో ఎంటర్ చేయాలని ఆదేశించారు.

పోస్టులు భర్తీ చేయాలి

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీలో ఉర్దూ మీడియం ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇమాంబాషా, సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా ఉర్దూ మీడియంలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు నష్టపోయారని, రాబోయే డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని కోరారు.

రేపు ప్రపంచ బ్యాంకు అధికారుల రాక

ఉయ్యాలవాడ: మండలంలోని రూపనగుడి గ్రామానికి ప్రపంచ బ్యాంకు అధికారులు ఈనెల 26వ తేదీన రానున్నారని మైనర్ ఇరిగేషన్ మునాఫ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామ సమీపంలోనున్న చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ సాగు నీరు సంయుకృత అభివృద్ధిలో భాగంగా 2019లో రూ.1.20 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వస్తున్నట్లు వెల్లడించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి

ఉయ్యాలవాడ: గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములు చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అధికారులకు సూచించారు. సోమవారం పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక గ్రామ సచివాలయంలో మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి సర్పంచ్ మేకల ఓబులేస్‌తో కలిసి నివాళులర్పించారు. ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.అలాగే మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సర్పంచ్‌ల అధ్యక్షతన చేపట్టారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

ఉయ్యాలవాడ:స్థానిక మోడల్ స్కూల్ సమీపంలోనున్న బీసీ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఫణీకృష్ణ సోమవారం పరిశీలించారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మురుగు కాలువల నిర్మాణం కోసం రూ.20 లక్షలు ఎంపీ ల్యాండ్స్ నిధులు మంజూరు చేయడంతో పనులు చేపట్టినట్లు ఏఈ పేర్కొన్నారు. కాలనీలో 517 మీటర్ల పొడువున కాలువలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్ పార్కులోని ఆయూష్ యోగా సమితి ఆధ్వర్యంలో శ్రీభగవాన్ సత్యసాయిబాబా ఆరాధన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా సత్యసాయిబాబా, యోగా గురువు ఆనంద్ గురూజీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. శాంతిరాం హాస్పిటల్ సహకారంతో బీపీ, ఆర్‌ఎస్, బీఎంఐ, పరీక్షలు ఉచితంగా చేశారు. అనంతరం యోగా సభ్యులు 50 మంది రక్తదానం చేశారు.

మహాత్మా గాంధీకి నివాళి

ఆళ్లగడ్డ: చాగలమర్రిలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ తులశమ్మ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అందరి సహకారంతోనే చాగలమర్రి మేజర్ పంచాయతీ అవార్డుకు ఎంపికైందన్నారు. ఈఓపీఆర్డీ నాగేంద్రయ్య, ఈఓ సుదర్శనరావు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సీఐ

రుద్రవరం: మండలంలోని హరినగరం సమీపంలోని గండ్లేరు రిజర్వాయర్ దిగువ భాగంలోనున్న నాటుసారా స్థావరాలపై సీఐ చంద్రబాబునాయుడు సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 3,400 లీటర్లన బెల్లం ఊటను ధ్వంసం చేసి 80 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. హరినగరం గ్రామానికి చెందిన రమేష్, బాలస్వామి తండాకు చెందిన పీసునాయక్, విష్ణునాయక్ కలిసి మూడు నాటుసారా బట్టీలు ఏర్పాటు చేసుకున్నారు. దాడుల్లో రమేష్ పట్టుబడగా మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారని, వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ఆనందం పండింది

- రబీలో విస్తారంగా వరి పంట సాగు
- సాధారణ విస్తీర్ణానికి మించి నాట్లు
- అనుకూలించిన వాతావరణం
- ఎకరాకు 35–45 బస్తాల దిగుబడి
- జోరుగా సాగుతున్న కోతలు



శ్రీనివాసపురం వద్ద మిషన్‌తో వరిపైరును కోయిస్తున్న దృశ్యం



సంచుల్లో నింపిన వరి ధాన్యం

గోస్పాడు: ఖరీఫ్‌లో వరి పంట సాగు రైతులకు కలిసొచ్చింది. దిగుబడి, ధర బాగుండటంతో చాలా ఏళ్ల తరువాత వరి రైతులు లాభాలు చూశారు. దీంతో రబీలో కూడా వరి పంటే సాగు చేయాలని నిర్ణయించారు. ఇందుకు వర్షాలు సమృద్ధిగా కురవడం, జలాశయాల్లో నీటినిల్వలుండటంతో సాధారణ విస్తీర్ణం కన్నా అధికంగా పంట సాగైంది. వారి ఆశలకనుగుణంగానే కేసీ కెనాల్‌లో నీరు పుష్కలంగా పారడంతో రెండుపంటలు పండించారు.నంద్యాల, గోస్పాడు మండలాల్లో రబీలో కేసీ కాలువ కింద అధికంగా వరి సాగు చేశారు.

అధికంగా సాగు..

గోస్పాడు మండలంలో 887 ఎకరాల సాధారణ విస్తీర్ణం కాగా 3,595 ఎకరాల్లో వరి పైరు సాగైంది. మండలంలోని సాంబవరం, దీబగుంట్ల, జిల్లెల్ల, కానాలపల్లె, యాళ్లూరు, శ్రీనివాసపురం, సత్యనారాయణపురం, పసురపాడు, ఎం.చింతకుంట్ల, జూలేపల్లె, గోస్పాడు తదితర గ్రామాల్లో వరి అధికంగా సాగైంది.అలాగే నంద్యాల మండలంలో 4,292 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా 5వేల ఎకరాల్లో వరిపైరు సాగైందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. చాబోలు, అయ్యలూరు, పెద్దకొట్టాల, చాపిరేవుల,కొత్తపల్లె, భీమవరం, తదితర గ్రామాల్లో పంట అధికంగా వేశారు. రబీ సీజన్‌లో 555, షుగర్ లెస్ వంటి రకాలు అత్యధికంగా సాగయ్యాయి.

జోరుగా కోతలు..

పంట కాలం పూర్తవడంతో ప్రస్తుతం నంద్యాల, గోస్పాడు మండలాల్లో వరి కోతలు ఊపందుకున్నాయి. వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు ఖరీఫ్ నాటికి ఏమాత్రం తగ్గలేదు.రైతులు మిషన్ల ద్వారా పైర్ల నూర్పిడి చేయిస్తున్నారు. కొందరు కోత కోసి వెంటనే అమ్మేస్తుండగా, మరికొందరు నూర్పిడి చేసిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసే పనుల్లో నిమగ్నమయ్యారు. పంట సాగుకు ఎకరాకు రూ.25వేల వరకు వెచ్చించారు. దిగుబడి మాత్రం 35 – 45 బస్తాల వరకు వస్తుండటంతో అన్నదాతల్లో ఆనందానికి అవధుల్లేవు. మార్కెట్లో 555 రకం వరి బస్తా (75 కేజీలు) రూ.1200 నుంచి రూ.1350 వరకు, షుగర్‌లెస్ రకం వరి బస్తా రూ.1300 నుంచి రూ.1500 వరకు ధర ఉందని రైతులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఇంకా మంచి ధర లభిస్తుందని వారు పేర్కొంటున్నారు. కాగా.. ఖరీఫ్‌లో నంద్యాల సోన, కర్నూలు సోన రకాలు అధికంగా సాగవగా.. ఎకరాకు 35–45 బస్తాలు దిగుబడి లభించింది. ధర బస్తా రూ.2,100 వరకు పలికింది.



యాళ్లూరు వద్ద ఆరబోసిన వరి ధాన్యం

భయపెడుతున్న వాతావరణం..

నాలుగు రోజులుగా వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తుండటంతో చేతికొచ్చిన పంట నేలవాలుతోంది. అలాగే ఆరబోసుకున్న ధాన్యం తడిసిపోకుండా కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు.

పూర్తిస్థాయిలో నీరందింది



గత నెలలో కేసీ కాల్వకు నీరు వస్తుందో, రాదోనని ఆందోళన చెందాం.ప్రజా ప్రతినిధులు, కేసీ కాల్వ అధికారుల చొరవతో కాల్వకు పూర్తిస్థాయిలో నీరు అందింది. దీంతో రబీలో సాగు చేసిన పైర్లు పూర్తిస్థాయిలో చేతికి వస్తున్నాయి. వరి పంట మంచి దిగుబడి లభిస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తే బాగుంటుంది.

– వెంకటేశ్వరరావు, రైతు, శ్రీనివాసపురం, గోస్పాడు

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు



నాణ్యమైన విత్తనాలు, విత్తనానికి ముందు శుద్ధి చేసి పంట సాగు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో రబీలో వరి పంటలో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. సస్యరక్షణ పద్ధతులతో పాటు సరిపడ ఎరువు, పురుగు మందులు వాడితే దిగుబడులపై అనుమానం ఉండదు.

– అబ్దుల్‌హక్, ఏఓ, గోస్పాడు

సమస్యలు పరిష్కరించండి

నంద్యాల(అర్బన్): జిల్లాలో కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న రజకులకు దోబీ ఘాట్లు ఏర్పాటు చేయాలని రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి ఆధ్వర్యంలో సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. నంద్యాల జిల్లా కన్వీనర్ నాగరాజు, కార్యదర్శి విశ్వనగర్ రాము, ఈశ్వరయ్య పాల్గొన్నారు. అలాగే.. ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రసాదరావుపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం డాక్టర్లు సైతం విధులకు ఆలస్యంగా వస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. సేవలు అందించకుండా సొంత క్లినిక్‌లకు వెళ్తున్నా చర్యలు చేపట్టకపోవడాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఆళ్లగడ్డ తాలూకా అడ్వకేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణయ్య, ఆళ్లగడ్డ సీపీఐ కార్యదర్శి భాస్కర్ తదితరులు.. నంద్యాల లేబర్ 11టీంలకు ట్రోఫీతో పాటు రూ.20వేల నగదు, రెండో జట్టుకు పీకేఎల్ కింగ్ జట్టుకు ట్రోఫీ రూ.10వేల నగదు అందజేశారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాయమాల్పూరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి నిర్వహించారు. గ్రామంలోని గడప గడపకు తిరిగి పథకాలు అందుతున్నాయా లేదా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడున్నరేళ్లలో జగనన్న పాలనను ప్రత్యక్షంగా గమనించామని, రాబోవు రోజుల్లో కూడా ఇదే తరహా పాలన ప్రజలకు అందిస్తామన్నారు. వచ్చే ఎన్నికలలో కూడా ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెంటనే ఉన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, సర్పంచ్ పార్వతమ్మ, నాయకులు పూలశీను, బాషా, ప్రేమకుమార్, ఎర్రబాషా, పుశేని పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

నంద్యాల: నంద్యాల పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 14వ వార్డు సరస్వతీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.13.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, కల్వర్టులను సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గడప గడపకు కార్యక్రమం చేపట్టారని, ఇందులో భాగంగా స్థానికులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించామని చెప్పారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్ ఆళ్లగడ్డ విమలమ్మ, సోమశేఖర్ రెడ్డి, దేశం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘జగనన్నే మా భవిష్యత్తు’కు విశేష స్పందన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి, పీపీ నాగిరెడ్డి

నంద్యాల: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందన్నారు. మెగా పీపుల్స్ సర్వేలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పరిపాలన తీరుపై అడిగిన 5 ప్రశ్నలకు ప్రజలు ఏకంగా 79శాతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశ్వాసం తెలియజేస్తూ ప్రతిస్పందించి మిస్డ్‌కాల్స్ ఇచ్చారన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కైపరాముడు, నాయకులు సలాముల్లా, బసవేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, అమృతరాజ్ పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలించండి



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ, వైద్యులు

నంద్యాల: జిల్లాలో జీరో మలేరియా కేసులు నమోదు కావాలని, అందుకు తగ్గ చర్యలు చేపట్టాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ, మలేరియా అధికారులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో స్పందన కార్యక్రమ అనంతరం ఈనెల 25న ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఇతర వైద్య అధికారులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది 8 మలేరియా కేసులు నమోదయ్యాయని, ఈ ఏడాది ఒక్క కేసు కూడా నమోదు కాకుండా మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించి దోమల పెరుగుదలను అరికట్టాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ జఫరుల్లా, జిల్లా మలేరియా అధికారి కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు పంచాయతీలకు అవార్డులు

శిరివెళ్ల: మండలంలో 4 గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులను ప్రకటించిందని ఈఓఆర్డీ సాల్మన్‌రాజు తెలిపారు. ఉత్తమ పారిశుద్ధ్యపు అవార్డుకు స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికైన సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిరివెళ్లతో పాటు యర్రగుంట్ల పంచాయతీకి పేదరకం, జీవనోపాధులపై అవార్డు, మహదేవపురానికి ఆరోగ్య పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ అవార్డు గంగవరం పంచాయతీకి దక్కాయి. సర్పంచు లక్కాకుల సాలమ్మ మాట్లాడుతూ అధికారులు, ప్రజలు ,సిబ్బంది సంయుక్త కృషితో పంచాయతీకి అవార్డు వచ్చిందన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం , ఉప సర్పంచు ఇంతియాజ్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. అవార్డులకు ఎంపికైనందుకు యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచు అయ్యలూరి సుభహాన్, మహదేవపురం సర్పంచు పెద్ది రమణయ్య, గంగవరం సర్పంచు మహాలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. అవార్డులకు ఎంపికైన పంచాయతీలకు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం అభినందనలు తెలిపారు.

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు: ఎండలు విపరీతంగా పెరిగాయని వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నాగేంద్ర సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కంపమల్ల (కోవెలకుంట్ల మండలం) గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు వ్యాధులకు సంబంధించి 65 మందికి వైద్యపరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు.

సంక్షేమంతో పేదల జీవితాల్లో వెలుగు



సంక్షేమ పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: నవరత్నాలు పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అహోబిలం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి పథకాల అమలు తీరును తెలుసుకొని, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ప్రస్తావించిన సమస్యలను అక్కడే ఉన్న అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ కొంత మంది ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మాత్రమే ప్రజలకు వద్దకు వస్తారని, కానీ తాము మాత్రం ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించేందుకు వస్తున్నామని చెప్పారు. ప్రజలను ఓటు బ్యాంక్‌గా చూసిన టీడీపీ.. ఏం చేసిందని జనం వద్దకు వస్తున్నారని ప్రశ్నించారు. తమ వారిని స్థితిమంతులను చేయడానికి పథకాలు అమలు చేసి, పేదలకు అందకుండా చేశారని విమర్శించారు. నాడు గ్రామంలో పథకాలు అందేవారి సంఖ్య చేతివేళ్లపై లెక్కించేవారని, నేడు.. ప్రతి ఇంటికి దాదాపు 8 పథకాలు అందుతున్నాయని ఇది నిజమా..కాదా..అని స్థానికుల నుంచి సమాధానం రాబట్టారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. టీడీపీ చెప్పే మాయమాటలను నమ్మవద్దని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మీ దీవెనలు మరోసారి కావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహ ప్రసాద్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, సచివాలయ మండల కన్వీనర్ రామకృష్ణ, నాయకులు వెంకట సుబ్బయ్య, ఎంపీడీఓ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

పొలాల వద్ద దీర్ఘకాలికంగా హద్దుల విషయంలో ఇబ్బందులు పడుతున్న రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం ద్వారా పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. సోమవారం పట్టణ శివారులోని పొలాల్లో భూ సర్వేలో భాగంగా డ్రోన్‌ను ప్రారంభించారు. ఆధునిక యంత్రాల సాయంతో సర్వే చేస్తున్నారని, ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న రైతులకు శాశ్వత పరిష్కారం చూపుతుందని చెప్పారు. మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నరహరి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, శిరివెళ్ల మండల కన్వీనర్ ఇందూరి ప్రతాప్‌రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని రూ.18లక్షలు పుల్లరి నగదుకు లెక్కలు చూపించకుండా తప్పించుకు తిరుగుతున్న నలుగురిపై చీటింగ్ కేసు నమోదు చేశామని ఎస్ఐ తిరుపాలు సోమవారం తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన పల్లె శివశంకర్, పల్లె ప్రసాద్‌రెడ్డి, చిన్న ఓబయ్యగారి చిన్న ఓబుళరెడ్డి గ్రామ పెద్దలుగా ఉన్న సమయంలో పుల్లరి డబ్బులు రూ.6.84లక్షలు, పెద్దిరెడ్డిగారి వెంకరామిరెడ్డి వద్ద ఉన్న రూ.11.16 లక్షలు వారి వద్దనే ఉంచుకున్నారు. గ్రామస్తులు లెక్కలు చూపాలని కొంతకాలంగా అడుగుతున్నా సమాధానం చెప్పడం లేదు. దీంతో గ్రామానికి చెందిన శ్రీవర్ధన్ రెడ్డి ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బ్యాంకు సేవలపై అవగాహన

గోస్పాడు: బ్యాంకు సేవలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజాహుసేని, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ అన్వేష్‌రెడ్డి అన్నారు. స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా వొకేషనల్ ఎడ్యుకేషనల్ ట్రైనర్ విజయమ్మ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీఐ బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాంకులో జరిగే లావాదేవీలు, ఖాతాదారులకు బ్యాంకులో అందించే సేవలు, వివిధ రకాల రుణ సదుపాయాలు, ఈ– బ్యాంకింగ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

దొర్నిపాడు: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ జయప్రసాద్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కార్యలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యల పట్ల ప్రజలు కార్యలయాలకు వస్తారని వారి సమ్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరం చూపాలని కోరారు. రెవెన్యూ సమస్యలను పెండింగ్ ఉంచకుడా వెంటనే పరిష్కారం చూపాలని చెప్పారు. మండల సర్వేయర్ మల్లయ్య, వీఆర్‌ఓలు సాంబశివుడు, నాగేష్, సావిత్రి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యలయంలో పాఠశాల సమాచారం పొందుపరచడంపై సోమవారం శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్ జగన్ మోహన్‌రెడ్డి స్కూల్ పెర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ టూల్ అనే యాప్‌ను ఉపయోగించి పాఠశాల సమగ్ర సమాచారాన్ని ఎలా పొందుపరుచాలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, కేజీబీవీ ఎస్‌ఓ లక్ష్మిదేవి, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని చంద్రబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజా సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోని చంద్రబాబు నాయుడు.. అధికారం పోతే అందరిపైనా బురద జల్లే ప్రయత్నం చేస్తారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, పాలనలోని తేడాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని చెప్పారు. సొంతింటి కలను సాకారం చేశారంటూ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారని, ఇంటి వద్దకే పింఛన్ అందిస్తూ బాసటా నిలిచారని అవ్వతాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 98,750 నివాస గృహాలు ఉండగా ఇందులో సుమారు 71 వేల ఇళ్లకు కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేశామని, 29వ తేదీ లోపు మిగిలిన ఇళ్లు పూర్తి చేస్తామన్నారు. నాయకులు సింగం వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఇందూరు ప్రతాప్‌రెడ్డి, మాదం చెన్నయ్య, గంగుల రామిరెడ్డి ఉన్నారు.

ఉత్తమ పంచాయతీగా ఆలమూరు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న శిరివెళ్ల సర్పంచు సాలమ్మ



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఆలమూరు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామ పంచాయతీ ఉత్తమ పంచాయతీగా ఎన్నికైంది. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదిర్శి పాములేటిని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు చంద్ర, పాణ్యం నాగేష్, మాజీ సర్పంచ్ జయరాముడు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలోని 4 గ్రామ పంచాయతీలకు అవార్డులు దక్కాయి. సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి చేతుల మీదుగా శిరివెళ్ల, యర్రగుంట్ల, మహదేవపురం, గంగవరం గ్రామ సర్పంచులు లక్కాల సాలమ్మ, అయ్యలూరి సుభహాన్, పెద్ది రమణయ్య, మహాలక్ష్మి జిల్లా స్థాయి ఉత్తమ్మ పంచాయతీ పురస్కారాలను అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న యర్రగుంట్ల సర్పంచు సుభహాన్

ఉర్దూ బోర్డులు ఏర్పాటు చేయాలి

నంద్యాల(వ్యవసాయం): ప్రభుత్వ కార్యాలయాలపై ఉర్దూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండవ అధికార భాష ఉర్దూ ఉన్నందున, ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో తెలుగుతో పాటు ఉర్దూ భాషలో కూడా బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ మాట్లాడుతూ ఉర్దూ నేంప్లేట్లను తయారు చేసి రాజకీయ నాయకులు, అధికారులకు బహూకరించడం అభినందనీయమన్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. అబ్దుల్లా, అతావుల్లాఖాన్, మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలాముల్లా, జుబేర్‌బాషా, జమాన్ పాల్గొన్నారు.